

# విభారె
## తెలుగు దినపత్రిక
## VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి గురువారం 17-07-2025 సంపుటి : 07 సంచిక : 66 పేజీలు : 8 వెల : రూ 3-00

# కేంద్ర కేబినెట్ భేటీ.. పలు కీలక నిర్ణయాలు



న్యూఢిల్లీ, జులై 16: ప్రధాని మోదీ అధ్యక్షతన కేంద్ర కేబినెట్ బుధవారం న్యూఢిల్లీలో సమావేశమైంది. ఈ సమావేశంలో కేబినెట్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. అలాగే యాక్సియం - 4 మిషన్ విజయం కావడంపై హర్షం వ్యక్తం చేసింది. ఈ మిషన్‌లో భాగంగా అంతర్జాతీయ అంతరిక్ష యాత్రకు సురక్షితంగా వెళ్లి వచ్చిన భారతీయ వ్యోమగామి శుక్లాను అభినందించింది.దేశంలో రైతుల అభ్యున్నతి కోసం కేంద్రం ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపింది. అందులో భాగంగా ప్రైమ్ మినిస్టర్ దన్ ధ్యాన్ క్రిష్ యోజన కోసం ఏడాదికి రూ. 24 వేల కోట్లు కేటాయించాలని నిర్ణయించింది. అలాగే ఈ పథకం కింద 100 జిల్లాల అభివృద్ధి కోసం చర్యలు చేపట్టనున్నారు. పునరుత్పాదక శక్తిలో పెట్టుబడి పెట్టడంతోపాటు జాతీయ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్టీపీసీ) సంస్థను బలోపేతం చేయాలని కూడా నిర్ణయించింది.అలాగే ఎన్టీపీసీ అనుబంధ సంస్థ గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులను అభివృద్ధి పరిచే కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపింది. ఎన్టీపీసీ ఈక్విటీ ఇన్ఫ్యూషన్ రూపంలో ఎన్‌జీఈఎల్‌లో ఇప్పటి వరకు రూ. 7,500 పెట్టుబడి పెట్టినట్లు వివరించింది. ఇక ఎన్‌జీఈఎల్‌లో రూ. 20 వేల కోట్ల పెట్టుబడికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది

# తప్పుడు కేసులకు లెక్క తేలుస్తాం

**కావాలనే తన పర్యటనలో రెచ్చగొట్టే చర్యలు**
**చేసిన అప్పులకు చంద్రాబు లెక్కలు చెప్పాలి**
**మీడియా సమావేశంలో మండిపడ్డ జగన్**



అమరావతి,జూలై16: తమపై ఎన్ని తప్పుడు కేసులు పెట్టినా.. భయపడేది లేదు, ప్రజల తరఫున పోరాటం ఆగేది లేదు అని వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ తెలిపారు. పెట్టిన తప్పుడు కేసులకు వడ్డీతో సహా చెల్లిస్తాం అని వార్నింగ్ ఇచ్చారు. మహా అయితే కూటమి ప్రభుత్వం మరో మూడేళ్లు ఉంటుందని, ఆ తర్వాత అన్నీ చెల్లిస్తామని హెచ్చరించారు. రాష్ట్రాన్ని శ్రీలంక చేస్తున్నారని తమపై అభాండాలేశారని, సీఎం చంద్రబాబు ఏడాదిలోనే రూ.లక్షా 75 వేల కోట్లు అప్పులు చేశారని విమర్శించారు. ఎవరికీ ఏ స్కీమ్ ఇచ్చింది లేదు అని, మరి ఎవరి జేబుల్లోకి డబ్బులు వెళ్లాయో తెలియదన్నారు. చంద్రబాబు ఇప్పటికైనా తప్పు తెలుసుకో అని, ఆలోచన మార్చుకో అని వైఎస్ జగన్ సూచించారు. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో వైఎస్ జగన్ మీడియాతో మాట్లాడుతూ... '18 వేల కోట్లు- ప్రజలపై విద్యుత్ భారం మోపారు. ఏం పెరిగినా ఎవరూ మాట్లాడకూడదు, పెరిగిన బ్రతుకు భారం గురించి ప్రశ్నిస్తే తప్పుడు కేసులు పెడుతున్నారు. నాణ్యత లేని పనులు జరిగినా.. ఒక్క రూపాయికే భూములు ఇస్తున్నా ప్రశ్నించకూడదు. మేం మంచి జరిగేలా పీపీఏలు చేసుకున్నా.. ఇవాళ 4.60 రూపాయలకు పీపీఏ చేసుకున్నా అడగకూడదు. ఎన్ని తప్పుడు కేసులు పెట్టినా భయపడేది లేదు, ఆగేది లేదు. చంద్రబాబు పెట్టిన తప్పుడు కేసులకు వడ్డీతో సహా చెల్లిస్తాం. మహాఅయితే కూటమి ప్రభుత్వం మరో మూడేళ్లు ఉంటుంది. ఆ తర్వాత అన్నీ చెల్లిస్తాం అని హెచ్చరించారు.

# సీఆర్ పాటిల్ అధ్యక్షతన సమావేశం..

**హాజరైన తెలుగు రాష్ట్రాల సీఎంలు**






న్యూఢిల్లీ, జులై 16: కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం న్యూఢిల్లీలో (బుధవారం) కొనసాగుతోంది. సీఎంలు నారా చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డి, ఇరు రాష్ట్రాల నీటి పారుదల శాఖ మంత్రులు, సీఎస్‌లతోపాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. గోదావరి బనకచర్ల సింగిల్ పాయింట్‌ను ఎజెండాలో ఏపీ ప్రభుత్వం పెట్టింది. అలాగే తెలంగాణ ప్రభుత్వం 13 అంశాలను ఎజెండాలో పెట్టింది. పాలమూరు -రంగారెడ్డి, డిండి, సమ్మక్క సాగర్, ప్రాణహిత - చేవెళ్ల సహా పలు కీలక ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వాలని కేంద్రాన్ని తెలంగాణ ప్రభుత్వం కోరుతుంది.


1. గోదావరి - బనకచర్ల లింకు ప్రాజెక్టుపై చర్చ

తెలంగాణ ప్రభుత్వ ఎజెండాలోని 13 అంశాలు

1. పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, డిండి ఎత్తిపోతల పథకానికి అనుమతులు ఇవ్వాలి
2. శైలం నుంచి వేరే బేసిన్‌కు నీటి తరలింపు పనులను వెంటనే ఆపేయాలి.
3. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ ప్రారంభించిన ప్రాజెక్టులకు సహకరించేలా కృష్ణా ట్రిబ్యునల్‌లో మద్దతుగా వాదించేలా ఏపీని ఒప్పించాలి.
4. కృష్ణానది జలాలను వేరే బేసిన్‌కు తరలించకుండా కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు చర్యలు తీసుకునేలా ఆదేశించాలి. కృష్ణా జలాలను అక్రమంగా తరలింపును అడ్డుకునేందుకు టెలిమెట్రీలను ఏర్పాటు చేసేందుకు ఆంధ్రప్రదే ప్రభుత్వం ఒప్పుకోవాలి.
5. తుంగభద్ర బోర్డు నీటి తరలింపుపై చర్చించాలి.
6. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పథకంపై ఎన్జీటీ ఉత్తర్వులను అమలు చేసే విధంగా కేంద్ర జలశక్తి శాఖ చర్యలు తీసుకోవాలి. ఈ మేరకు పునరుద్ధరణ జరపాలి. ఈ పథకంపై చట్టపరంగానే ముందుకు వెళ్లాలి.
7. శ్రీశైలం కుడి కాలువ ద్వారా ఎక్కువ నీటి తరలింపును నియంత్రించాలి.
8. శ్రీశైలం ప్రాజెక్టులో కొత్త ప్రాజెక్టులు హంద్రీనీవా,వెలిగొండ,గురు రాఘవేంద్ర నిర్మాణాలను నియంత్రించాలి.
9. శ్రీశైలం డ్యామ్ భద్రతకు తగిన చర్యలు తీసుకోవాలి.
10. అక్రమంగా శ్రీశైలం నుంచి నీటి తరలింపు ద్వారా విద్యుత్ ఉత్పత్తికి తీవ్ర విఘాతం కలుగుతుంది. దీనిని అడ్డుకోవాలి
11. పోలవరం ప్రాజెక్టు తరహాలోనే ఇచ్చంపల్లి ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలి. ఇచ్చంపల్లి నుంచి కావేరికి గోదావరి జలాల తరలింపునకు తాము సిద్ధం. అందులో 200 టీఎంసీల నీటిని వాడుకునేందుకు అనుమతులు ఇవ్వాలి.
12. సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వాలి.
13.ప్రాణహిత-చేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్టుకు ఏఐబిపి కింద నిధులు మంజూరు చేయాలి. మహారాష్ట్ర ప్రభుత్వంతో కేంద్ర ప్రభుత్వమే చర్చలు జరిపి తుమ్మిడి హట్టి వద్ద బ్యారేజ్ నిర్మాణానికి సహకరించాలి.

మరోవైపు..ఈ సమావేశంలో బనకచర్ల ఎజెండాగా చేర్చడంపై తెలంగాణ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఇప్పటికే కేంద్రానికి లేఖ రాసిన సంగతి తెలిసిందే. గోదావరి - బనకచర్ల లింకు ప్రాజెక్టుపై చర్చను వాయిదా వేయాలని ఆ లేఖలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించింది. రాష్ట్రంలో కరువు ప్రాంతాలకు నీటిని తరలించేందుకు కీలకమైన పోలవరం - బనకచర్ల లింకు ప్రాజెక్టును పూర్తి చేసేందుకు ఇప్పటికే ప్రణాళికలను ఏపీ ప్రభుత్వం సిద్ధం చేసింది. పోలవరం నుంచి కర్నూలు జిల్లా బనకచర్ల రెగ్యులేటర్ వరకు 200 టీఎంసీల వరద నీటిని తరలించేలా ఈ లింకు ప్రాజెక్టును ఏపీ ప్రభుత్వం ప్రతిపాదించిన విషయం విదితమే.

# పీఎం ధన్ ధాన్య కృషి యోజన పథకానికి కేంద్ర కేబినెట్ ఆమోదం



న్యూఢిల్లీ: కేంద్ర కేబినెట్ ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన స్కీమ్‌కు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. రూ.24వేల కోట్లతో పథకం అమలు చేయనున్నట్లు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. పునరుత్పాదక ఇంధనంలో పెట్టుబడి పెట్టేందుకు ఎన్ఎల్‌సీఐఎల్ ప్రభుత్వం రూ.7వేల కోట్లు, ఎన్టీపీసీ కోసం రూ.20వేల కోట్ల పెట్టుబడులకు మంత్రివర్గం ఆమోదించింది. కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన స్కీమ్ ద్వార ఇప్పటికే ఉన్న 36 పథకాలను ఏకీకృతం చేస్తుందన్నారు. పంటల వైవిధ్యం, స్థిరమైన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహిస్తుందని పేర్కొన్నారు. కేంద్ర మంత్రివర్గంలో తీసుకున్న నిర్ణయాలను కేంద్రమంత్రి వివరిస్తూ.. ప్రధాన మంత్రి ధన్ ధాన్య కృషి యోజన పంటకోత తర్వాత నిల్వను పెంచుతుందన్నారు. నీటిపారుదల సౌకర్యాలను మెరుగుపరుస్తుందన్నారు. వ్యవసాయ ఉత్పాదకతను పెంచుతుందని.. ఈ కార్యక్రమం ద్వారా 1.7 కోట్ల మంది రైతులకు లబ్ధి జరుగుతుందని ఆయన వివరించారు.

# సమన్వయంతో సీఎం పర్యటనను విజయవంతం చేయాలి

## జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 16-గురువారం నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం మల్యాల గ్రామంలో హంద్రీనీవా సుజల స్రవంతి ఎత్తిపోతల పథకం పంపింగ్ స్టేషన్ నందు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు జలహారతి కార్యక్రమం నిర్వహించి నీటిని విడుదల చేయనున్న సందర్భంగా పర్యటనకు సంబంధించి ముందస్తు ఏర్పాట్లను మరియు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, జేసి విష్ణు చరణ్ లతో కలిసి మల్యాల గ్రామంలోని హెలిపాడ్, నీటి పంపింగ్ స్టేషన్ జలహారతి నిర్వహించచే ప్రదేశం, సభాస్థలి మొదలగు ప్రాంతాలలో కలెక్టర్ విస్తృతంగా పర్యటించి చేయాల్సిన ముందస్తు ఏర్పాట్లు మరియు బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. అధికారులందరూ సమన్వయంతో ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు పర్యటించే ప్రదేశాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతాచర్యులు ఏర్పాటు చేయడంతో పాటు, ఉమ్మడి కర్నూలు జిల్లా నుండి ప్రజా ప్రతినిధులు ప్రజలు ముఖ్యమంత్రి గారి పర్యటనకు విచ్చేయనున్న సందర్భంగా ఎలాంటి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని, వాహనాల పార్కింగ్ కొరకు అనువైన ప్రదేశాలను ఏర్పాటు చేసి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ మరియు ఎస్పీ ఆదేశించారు. అనంతరం వివిధ అంశాలలో అధికారులతో సమీక్షించి తగు సూచనలు సలహాలు జారీ చేశారు.



# ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఎయిర్పోర్ట్ లో పకడ్బందీగా భద్రతా ఏర్పాట్లు చేయండి జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా



కర్నూలు,, జూలై 16 : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన సందర్భంగా కర్నూలు ఎయిర్పోర్ట్ లో పకడ్బందీగా భద్రతా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. ఈ నెల 17న నంద్యాల జిల్లా మల్యాల వద్ద హెచ్ఎన్ఎస్ఎస్ నుండి నీటిని విడుదల చేసే కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొననున్న సందర్భంగా తొలుత ముఖ్యమంత్రి కర్నూలు విమానాశ్రయానికి చేరుకోనున్నందున బుధవారం జిల్లా కలెక్టర్ ఎయిర్పోర్ట్ లో ఏర్పాట్లను ఎస్పీ విక్రాంత్ పాటిల్ తో కలిసి పరిశీలించారు.. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఎయిర్పోర్ట్ లో పకడ్బందీగా బందోబస్తు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎస్పీ కి సూచించారు. ఎయిర్పోర్ట్ లో సేఫ్ రూమ్ ఏర్పాటు చేయాలని, మెడికల్ టీమ్ కూడా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, అదే విధంగా ఓర్వకల్లు పీహెచ్సి లో కూడా సేఫ్ రూమ్ ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డిఎంహెచ్ఓ ను ఆదేశించారు.... అగ్నిమాపక వాహనాలను సిద్ధంగా ఉంచుకోవాలని కలెక్టర్ అగ్నిమాపక శాఖ అధికారిని ఆదేశించారు.. లాంజ్ లో తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆర్ అండ్ బి ఎస్ఈ ని ఆదేశించారు..ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో భాగంగా రోడ్డు మార్గంలో వెళ్లేందుకు వీలుగా కూడా కాన్వాయ్ లో వాహనాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ డిటిసిని ఆదేశించారు.... రోడ్డు మార్గంలో ఏవైనా మరమ్మతులు ఉంటే చేయించాలని కలెక్టర్ ఆర్ అండ్ బి ఎస్ఈ ని ఆదేశించారు... కార్యక్రమంలో ఎయిర్పోర్ట్ డైరెక్టర్ విద్యా సాగర్, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్,ఆర్అండ్ బి ఎస్ఈ మహేశ్వర రెడ్డి, ఇంచార్జి డిఎమ్హెచ్ ఓ డా.భాస్కర్ రాజు, డిటిసి శాంత కుమారి, అగ్నిమాపక శాఖ అధికారి అవినాష్ జయసింహ, తదితరులు పాల్గొన్నారు..

# సంపాదకీయం

గురువారం 17-07-2025

## నిర్మాణాల్లో కనిపించని నాణ్యత

భారతదేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని మనం గొప్పగా చెప్పుకొంటున్నాం. కొత్త రహదారులు, ఆకాశాన్ని తాకే భవంతులు, ఆధునిక వంతెనలతో దేశ ముఖచిత్రం మారిపోతున్నదని సంబురపడుతున్నాం. కానీ, వేగవంతమైన ప్రగతి వెనక, నాణ్యత లేని నిర్మాణాలు, నిర్వహణకు నోచుకోని వంతెనలు, రోడ్లు నిశ్శబ్దంగా ప్రజల ప్రాణాలను బలి గొంటున్నాయి. తాజాగా గుజరాత్‌లోని వడోదర జిల్లాలో మహిసాగర్ నదిపై పాత వంతెన ఉన్నట్టుండి కుప్పకూలింది.వంతెనపై వెళ్తున్న వాహనాలు అమాంతం నదిలో పడ్డాయి. గతంలో తెలంగాణలో నిర్మాణ దశలో ఉన్న మానేరు వంతెన, శతాబ్దాల చరిత ఉన్న వేములవాడ వంతెన కూలాయి. ఈ ఘటనలు నిజానికి చేదు అనుభవాలు. వంతెనలపై మృత్యువీచికలు ఇంకెన్నాళ్లు ? ఇటీవల వడోదరలో కూలిన వంతెన దాదాపు నాలుగు దశాబ్దాల పాతది. ఇలాంటి వంతెనలు వాటి జీవితకాలం ముగిసిన తర్వాత, సరైన నిర్వహణ లేకపోతే కూలిపోవడం సహజం.ప్రభుత్వాలు అలాంటి వంతెనల నుంచి ప్రజల ప్రాణాలను ఎలా కాపాడతాయనేదే ప్రశ్న. దేశంలో వంతెనలు కూలడం లేదా పాడవటానికి అనేక కారణాలున్నాయి. వాటిలో ప్రధానమైనది నిర్వహణ లోపం. రెండోది వాటి నిర్వహణకు ప్రభుత్వాలు తగిన నిధులు కేటా యించకపోవడం. మూడోది వంతెనల పటుత్వాన్ని చెక్ చేయాల్సిన ఇంజినీర్లు మిన్నకుండటం. వాస్తవానికి పాత వంతెనలకు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయా ల్సి ఉంటుంది.లేకపోతే మొత్తం వంతెన బలహీనపడుతుంది. వంతెనలు కూలడానికి మరో ప్రధాన కారణం.. నాణ్యత లేకుండా నిర్మాణం చేపట్టడం. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ నాణ్యతా ప్రమాణాలను పాటించకపోవడం, తక్కువ నాణ్యత గల పదార్థాలను ఉపయోగించడం వంటివి వంతెనల జీవితకాలాన్ని తగ్గిస్తాయి. వంతెనలపై ప్రతిరోజూ వందలాది వాహనాలు వెళ్తాయి. రాష్ట్రాలను, జిల్లాలను కలిపే వంతెనలపై అధిక లోడ్ తో వెళ్లే వాహనాలు ఎక్కువగా ఉంటాయి.వీటన్నింటినీ పరిగణలోకి తీసుకుని ప్రభుత్వాలు వంతెనలు నిర్మాణం చేపడితే బాగుంటుంది. కొన్నిసార్లు ఆ వంతెనలపె,? వాటి సామర్థ్యానికి మించి లోడ్ తీసుకెళ్లే వాహనాలు కూడా ప్రయాణిస్తాయి. వాటి రాకపోకలను నియంత్రించే సరైన వ్యవస్థ లేకపోవడమూ ప్రమాదాలకు కారణం. అలాగే ఎడతెరిపి లేకుండా కురిసే భారీ వర్షాలు, వరదలు, భూకంపాలు, ఇతర ప్రకృతి వైపరీత్యాలు వంతెనలు కూలడానికి కారణం. 2011లో బీహార్‌లోని కోసీ నదిపై ఉన్న ఒక పాత వంతెన కూలింది. 2012లో పశ్చి మ బెంగాల్‌లోని ఒక వంతెన కూలి కొంద రి ప్రాణాలను బలితీసుకున్నది. 2016లో మహారాష్ట్రలోని మహాడ్ వద్ద సావిత్రి నదిపై పాత వంతెన కూలిన ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ప్రమాదంలో పలువురు మృతిచెందారు. 2017లో ముంబైలో అంధేరీ రైల్వే స్టేషన్ సమీపంలోని పాదచారుల వంతెన కూలి పలువురు గాయపడ్డారు.2018లో పశ్చి మ బెంగాల్‌లోని మజెరత్ వంతెన కూలి ముగ్గురు మరణించారు. 2019లో బీహార్‌లోని గోపాల్‌గంజ్‌లోని గండక్ నదిపై నిర్మించి వంతెన కూలింది. 2022లో గుజరాత్‌లోని మోర్బీ వంతెన కూలి వంద మందికి పైగా మరణించారు. ఇది ఆ రాష్ట్రంలోనే పాత వంతెన. నిర్వహణ లోపం సరిగా లేకపోవడం వల్లనే ప్రమా దం సంభవించింది.2023లో బీహార్‌లో సుల్తాన్‌గంజ్‌– అగువానీ ఘాట్ వంతెన కూలిపోయిన ఘటన నిర్మాణంలో ఉన్న వంతెనల నాణ్యతపై ప్రశ్నలను లేవనెత్తిం ది. ఈ ప్రమాదాలన్నీ కలిపి మృతుల సంఖ్య కచ్చితంగా వేలల్లో ఉంటుందని అంచనా. కానీ, ఆయా ప్రభుత్వాలు ప్రమాదాల తీవ్రతను, మృతుల సంఖ్యను కచ్చితంగా చెప్పిన దాఖలా లేదు.తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం కొన్ని వంతెనలు శిథిలావస్థకు చేరుకున్నా యి. పెద్ద ఎత్తున వంతెనలు కూలిపోయిన సంఘటనలు తక్కువగా ఉన్నప్పటికీ, చిన్నపాటి నష్టాలు, మరమ్మతులు అవసరమైన వంతెనలు అనేకం ఉన్నాయి. తెలంగాణ లో ఇటీవల కాలంలో రెండు వంతెన ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఒకటి.. 2024 ఏప్రిల్‌లో పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఓడేడు గ్రామం వద్ద మానేరు వాగుపై నిర్మాణ దశలో ఉన్న వంతెన కూలిన ఘటన.ప్రమాదంతో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడం ఊరటనిచ్చే అంశం. రూ.49 కోట్ల అంచనాతో 2016లో ప్రారంభమైన ఈ ప్రాజెక్టు పను లు ఎనిమిదేండ్లు గడిచినా పూర్తి కాలేదు. కాంట్రాక్టర్ నాణ్యాత ప్రమాణాలు పాటించకపోవడం, అధికారులు నాణ్య తాపరమైన అంశాలను పెద్దగా తనిఖీ చేయకపోవడంతోనే ప్రమాదం జరిగిందనేది సుస్పష్టం.ఆ తర్వాత 2023 సెప్టెం బర్‌లో రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రము ఖ పుణ్యక్షేత్రం వేములవాడలో శతాబ్దాల నాటి ఒక కమాన్ బ్రిడ్జి కూలింది. ఘటన లో పది మందికి పైగా స్థానికులు గాయపడ్డారు. క్షతగాత్రుల్లో కొందరి పరిస్థితి ఇప్ప టికీ కేవలం మంచానికే పరిమితమై ఉన్న పరిస్థితి. వంతెన కూలిన సమయంలో దానిపై నుంచి వెళ్తున్న ఓ లారీ కూరగాయల మార్కెట్‌లోకి దూసుకెళ్లడంతో నష్ట తీవ్రత పెరిగింది.ఈ వంతెన వంద సంవత్సరాలకు పైగా పాతదని, సరైన నిర్వహణ లేకపోవడం వల్లే కూలిపోయిందని స్థానికులు నాడు ఆందోళన చేపట్టారు. ఆంధ్ర ప్రదేశ్‌లో కూడా అనేక పాత వంతెనలు ఉన్నాయి. ముఖ్యంగా తీరప్రాంతంలో, నదులపై ఉన్న వంతెనలు తుఫానులు, వరదల కారణంగా బీటలు వారుతున్నాయి.గతంలో ప్రకాశం బ్యారేజీ ప్రాంతంలో ప్రభుత్వాలు అనేక మరమ్మతులు చేపట్టాయి. భారీ ప్రాణనష్టం జరిగిన సంఘటనలు పెద్దగా నమోదు కానప్పటికీ, ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోతే ముమ్ముందు మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.

## మేయర్ విజయలక్ష్మి మాదిగలకు బహిరంగ క్షమాపణ చెప్పాలి : ఎమ్మార్పీఎస్

బొల్లారం : నగర మేయర్ గద్వాల విజయలక్ష్మిపై తక్షణమే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నమోదు చేయాలని, ఆమె వెంటనే మాదిగ సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేదంటే ఆమె ఇంటిని ముట్టడిస్తామని ఎమ్మార్పీఎస్ కంటోన్మెంట్ ఇన్‌చార్జి ఇటుక శ్రీ కిషన్ మాదిగ హెచ్చరించారు. బుధవారం బోయిన్ పల్లి మార్కెట్ యార్డ్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ నేతలతో కలిసి నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుల దురహంకార ధోరణితో ఎమ్మార్పీఎస్ దిమ్మెను కూల్చిన నగర మేయర్ గద్వాల విజయలక్ష్మిని బర్తరఫ్ చేయాలని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మేయర్ గద్వాల విజయలక్ష్మి వెంటనే మా మాదిగ సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని, కూల్చిన ఎమ్మార్పీఎస్



జెండా దిమ్మను తిరిగి అదేచోట పునర్నిర్మించాలని అన్నారు.అధికార బలంతో అన్యాయంగా ఎమ్మార్పీఎస్ నాయకులపై పెట్టిన అక్రమ కేసులు తక్షణమే ఉపసహరించుకోవాలని అన్నారు. తాను మాదిగ ఓట్లతో జడ్పీటీసీ, ఎంపీటీసీ, ఎమ్మెల్యే అయ్యానని, నేడు ముఖ్యమంత్రిని అయ్యానని ప్రగల్బాలు పలికే రేవంత్ రెడ్డి.. మాదిగలపై అనుచిత వ్యాఖ్యలు చేసినవారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. అధికార బలంతో తమపై అక్రమ కేసులు పెట్టించిన నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి తీరుపై తక్షణమే స్పందించి, మేయర్ పదవి నుంచి భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.మేయర్ విజయలక్ష్మి మాదిగలను అవమానించడమే కాకుండా అన్యాయంగా అక్రమ కేసులు పెట్టించిందని మండిపడ్డారు. వెంటనే విజయలక్ష్మిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీనియర్ నేత అజిత్ కళ్యాణ్, మక్కల అశోక్, నరసింహ, మధుకర్, విష్ణు, వెంకట్, ప్రవీణ్, గిరిబాబు, రమేష్, శ్రీనివాస్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## పాలనను గాలికొదిలి విమర్శలతోనే కాలం వెల్లదీస్తున్న రేవంత్ రెడ్డి : మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్

నల్లగొండ, జూలై 16 : సీఎం రేవంత్‌రెడ్డి పాలనను గాలికి వదిలి, విమర్శలతోనే కాలం వెల్లదీస్తున్నడని బీఆర్ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. సీఎంగా బాధ్యతలు చేపట్టి 19 నెలలైనా చేసింది శూన్యం అన్నారు. బీఆర్ఎస్, కేసీఆర్, ఆయన కుటుంబంపై విమర్శలతోనే కాలం వెళ్లదీస్తున్నట్లు తెలిపారు. బుధవారం నల్లగొండ పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్ రెడ్డి, నల్లమోతు భాస్కర్‌రావు, మాజీ జడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డిలతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం నల్లగొండకు వస్తే ఏం ఇచ్చి పోతాడో, ఎంత అభివృద్ధి చేస్తాడో అని



ప్రజలు ఎదురుచూస్తే, పనికిమాలిన మాటలతో సీఎం స్థానాన్ని దిగజార్చుతూ మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిపై సభలో తిట్ల పురాణం ఎత్తుకున్నట్లు తెలిపారు. గత పదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం 6.47 లక్షల రేషన్ కార్డులు ఇచ్చిందని, మీరు ఐదు లక్షలకే ఇంత గొప్పలు చెప్పుకోవాల్సిన అవసరం లేదన్నారు. ఇక బీసీ రిజర్వేషన్లపై ఆర్డినెన్స్ పేరుతో రేవంత్‌రెడ్డి కొత్త నాటకానికి తెరలేపాడని ఆయన విమర్శించారు .నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి మాట్లాడుతూ.. సీఎం తుంగతుర్తిలో రేషన్ కార్డులు ఇవ్వడానికి సభ పెట్టాడా ? లేదంటే జగదీశ్ రెడ్డిని, బీఆర్ఎస్ పార్టీని తిట్టడానికి సభ పెట్టాడా అనే విషయాన్ని తెలపాలన్నారు. జగదీశ్ రెడ్డిని మూడు నాలుగు ఫీట్లు అనడం కాదు ఆయన చేసిన అభివృద్ధి ఎంతో, మీ నాయకులు ఆరు ఫీట్లు ఉ ండి చేసిన అభివృద్ధి ఎంతో ఇక్కడి ప్రజలకు తెలుసన్నారు. కాళేశ్వరం ద్వారా నీళ్లు ఇవ్వకుండా రైతుల కడుపులు మాడ్చి గోదావరి నీళ్లు మొత్తం సముద్రంలోకి వదులుతున్నరని దుయ్యబట్టారు. 2014 ముందు రాష్ట్రంలో 60 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం దిగుబడి వస్తే, 2014 తర్వాత 3 కోట్ల మెట్రిక్ టన్నులకు పెరిగింది నిజం కాదా? అది చేసింది బీఆర్ఎస్ పార్టీ కాదా అని ఆయన ప్రశ్నించారు. పోతిరెడ్డిపాడు ప్రాజెక్ట్ ద్వారా ఆంధ్రాకు నీళు తీసుకెళ్తుంటే, ఇంకా ఎడమ కాల్వకు, ఏఎంఆర్‌పీకి నీళ్లు ఎందుకు ఇవ్వడం లేదని మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి జవాబు చెప్పాలన్నారు. అభివృద్ధిపై దృష్టి సారించకుండా నోటికి వచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు.మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కరరావు మాట్లాడుతూ.. ప్రజా ప్రతినిధులు పద్ధతిగా మాట్లాడాలే తప్పా పద్ధతి తప్పి మాట్లాడి ప్రజల ముందు పరువు తీసుకోవద్దని హితవు పలికారు. కేసీఆర్ ప్రత్యేక చొరవ చూపించి సీతారామ ప్రాజెక్ట్‌కు నీళ్లు ఇస్తే వాటిని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సద్వినియోగం చేసుకుంటున్నారన్నారు. కానీ నల్లగొండలో మాత్రం ఎడమ కాల్వకు నీళ్లు ఇవ్వాలనే సోయి ఇక్కడి మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి, ఉత్తమ్‌కుమార్ రెడ్డికి ఎందుకు లేదని ప్రశ్నించారు. జడ్పీ మాజీ చైర్మన్ బండా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. అబద్దాలు పదేపదే చెప్పి వాటిని నిజాలు చేయాలని కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు చూస్తే మాత్రం ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. కాంగ్రెస్ 19 నెలల పాలనలో గ్రామీణ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందన్నారు. వెంటనే గ్రామాల నిర్వహణకు నిధులు విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంచర్ల కృష్ణారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి నిరంజన్ వలి, పట్టణాధ్యక్షుడు భువనగిరి దేవేందర్, మాజీ మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, కటికం సత్తయ్య గౌడ్, చీర పంకజ్ యాదవ్, రేగట్టే మల్లికార్జున్‌రెడ్డి, సింగం రామ్మోహన్, అభిమన్యు, శ్రీనివాస్, కొండూరు సత్యనారాయణ, రావుల శ్రీనివాసరెడ్డి, ఐతగోని యాదయ్య, బొమ్మరబోయిన నాగార్జున, నారబోయిన భిక్షం పాల్గొన్నారు

## ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలువాలి

తానూర్ : ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని ఎస్సై షేక్ జుబేర్ అన్నారు. మండల కేంద్రంలో ఓంకార్ డే కేర్ హాస్పిటల్ డాక్టర్ చంద్రకాంత్ ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి వ్యక్తి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయాలని, రక్తదానంతో ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు.అన్ని దానాల కన్నా రక్త దానం గొప్పదని, అలాంటి దానాన్ని



చేయడానికి ముందుకు వచ్చిన దాతలకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు తాడేవారు విఠల్, జాదవ్ మాధవరావు పటేల్, నాయకులు శివాజీ పటేల్, పుండ్లిక్, సదాశివ్ పటేల్, చక్రధర్ పటేల్, గోవింద్ పటేల్, గ్రామస్థులు పాల్గొన్నారు.

## వడ్డీ వ్యాపారి ఇంటిముందు రైతుల అందోళన

మంచిర్యాల,మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేటలో వడ్డీ వ్యాపారి ఇంటి ఎదుట రైతులు చేసిన ధర్నా చర్చనీయాంశం అవుతోంది . మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట పట్టణంకు చెందిన అకినపల్లి శ్రీధర్ అనే వ్యక్తి లక్షెట్టిపేట పట్టణం లోని ఒక రైస్ మిల్ లీజ్ కు తీసుకోని గత 15 సంవత్సరాలనుండి రైతుల వద్ద వడ్లు కొనుగోలు చేస్తున్నాడు. ఈ క్రమంలో రైతులకు దగ్గర ఉంటూ వారి వద్ద కొనుగోలు చేసిన ధాన్యం కు కొంతమంది రైతులకు డబ్బులు చెల్లెస్తూ మరి కొంతమంది రైతులకు చెల్లించకుండ ప్రతి సంవత్సరం ప్రామిసరి నోట్ వ్రాసి ఇస్తున్నాడు.ఇలా సుమారు 100 మంది రైతులకు 3 నుండి 4 కోట్ల రూపాయల వరకు డబ్బులు బాకీ పడ్డాడు. వీరితో పాటు స్థానిక వడ్డీ వ్యాపారుల నుండి మరో 5 కోట్ల రూపాయలు అప్పు చేసాడు.ఈ అప్పులు బాధ నుండి తప్పించుకోవడానికి నిందితుడు శ్రీధర్ హైదరాబాద్ కు పారిపోయి ఐపీ పెట్టడానికి ప్రయత్నం చేస్తున్నాడు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి : ఎంపీడీఓ విజయకుమారి



త్రిపురారం, జూలై 16 : విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని త్రిపురారం ఎంపీడీఓ కునిరెడ్డి విజయకుమారి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని గిరిజన మినీ గురుకుల పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించడంతో పాటు స్టోర్ రూమ్‌లో కూరగాయలు, గుడ్లు, నిత్యావసర వస్తువులను పరిశీలించారు. నిత్యావసర సరుకులు ఎప్పటివి అప్పుడే తెచ్చుకోవాలన్నారు. బియ్యంలో మట్టిపెల్లలు, పురుగులు, మెరిగలు లేకుండా జల్లి పట్టించి వండాలన్నారు. పాఠశాలలో ఉన్న ఆర్ఓ ప్లాంట్ నీళ్లను వంటకు వాడాలన్నారు.పాఠశాల ప్రాంగణాన్ని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, వర్షాకాలం సీజన్‌లో దోమలు, ఈగలు ఎక్కువగా ఉండకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎక్కడ నిర్లక్ష్యం వహించినా ఉన్నతాధికారులకు తెలియచేయడం జరుగుతుందన్నారు. విద్యార్థినుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ప్రతివారం పీహెచ్‌సీ నుంచి వైద్య సిబ్బంది వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆమె వెంట గురుకుల పాఠశాల ఎస్ఓ భారతి, జూనియర్ అసిస్టెంట్ మహేశ్ ఉన్నారు.

## 26 మందిని చంపి సంబరాలు చేసుకున్న ఉగ్రవాదులు : పహల్గాం దాడిపై ప్రత్యక్ష సాక్షి



ఏప్రిల్ 22న పహల్గాంలో ఉగ్రదాడి జరిగిన విషయం తెలిసిందే. మినీస్విట్జర్లాండ్‌గా పేరొందిన బైసరాన్ వ్యాలీలో ప్రకృతి అందాలను ఆస్వాదిస్తున్న పర్యాటకులపై సమీపంలోని అడవిలో నుంచి వచ్చిన ఉ గ్రవాదులు విచక్షణా రహితంగా కాల్పులు జరిపారు. ఈ ఘటనలో 26 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై దేశ వ్యాప్తంగా ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. మరోవైపు ఈ పాశవిక దాడికి పాల్పడిన ముష్కరుల కోసం దర్యాప్తు బృందాలు గాలింపు కొనసాగిస్తున్నాయి. ఇక ఈ ఉగ్రదాడిపై జాతీయ దర్యాప్తు సంస్థ ఎన్ఐఏ (ఔఎం) దర్యాప్తు చేస్తోంది.ఈ దర్యాప్తులో తాజాగా కీలక విషయాలు వెల్లడయ్యాయి. కేసు దర్యాప్తులో భాగంగా ఎన్ఐఏ అధికారులు స్థానికులను, ప్రత్యక్ష సాక్షులను విచారిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో పహల్గాం మారణహోమాన్ని కళ్లారా చూసిన ఓ ప్రత్యక్ష సాక్షి దర్యాప్తులో సంచలన విషయాలను వెల్లడించినట్లు ఎన్ఐఏ వర్గాలు తాజాగా తెలిపాయి. బైసరాన్ వ్యాలీలో 26 మందిని పొట్టనపెట్టుకున్న ఉగ్రవాదులు.. దాడి అనంతరం గాల్లోకి కాల్పులు జరిపి సంబరాలు చేసుకున్నట్లు వెల్లడించారు. ఒక వర్గాన్ని మాత్రమే టార్గెట్ చేసి దాడి చేసినట్లు ప్రత్యక్ష సాక్షి పేర్కొన్నారు. అంతేకాకుండా పలు కీలక విషయాలు కూడా దర్యాప్తు అధికారులకు చెప్పినట్లు ఎన్ఐఏ వర్గాల ద్వారా తెలిసింది.

## పాకిస్థాన్‌లో ఆకస్మిక వరదలు..

### 116 మంది మృతి.. వందలాది మందికి గాయాలు

పొరుగు దేశం పాకిస్థాన్‌లో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాలకు ఆకస్మిక వరదలు సంభవించాయి. ఈ వరదలకు భారీగా ప్రాణ నష్టం సంభవించింది. జూన్ 26 నుంచి పాక్ అంతటా కురిసిన కుండపోత వర్షాల కారణంగా సంభవించిన వరదలకు 116 మంది ప్రాణాలు కోల్పోయారు. దాదాపుగా 253 మంది వరకూ గాయపడినట్లు ఆ దేశ జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ వెల్లడించింది.వర్ష సంబంధిత ఘటనల కారణంగా గత 24 గంటల్లో మరో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారని, 41 మంది గాయపడినట్లు తెలిపింది. అత్యధికంగా తూర్పు పంజాబ్ ప్రావిన్స్‌లో 44 మంది ప్రాణాలు కోల్పోయారు. ఆ తర్వాత ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లో 37 మంది, సింధ్ ప్రావిన్స్‌లో 18 మంది, బలూచిస్థాన్ ప్రావిన్స్‌లో 16 మంది మృతిచెందారు. ఈ వర్షాల కారణంగా పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఒకరు ప్రాణాలు కోల్పోగా.. సుమారు ఐదుగురు గాయపడినట్లు ఎన్‌డీఎంఏ తెలిపింది.మరోవైపు ఆయా ప్రావిన్స్‌లకు జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ వెదర్ అలర్ట్ జారీ చేసింది. పంజాబ్, ఖైబర్ పఖ్తుంఖ్వా, బలూచిస్థాన్ ప్రావిన్సుల్లో గురువారం వరకు భారీ వర్షాలు కొనసాగే అవకాశం ఉందని తెలిపింది. ఈ వర్షాలకు ఆకస్మిక వరదలు సంభవించొచ్చని హెచ్చరించింది.



# మళ్లీ యనమల యాక్టివ్...

కాకినాడ, జూలై 16, సీనియర్ నేత మాజీ మంత్రి యనమల రామకృష్ణుడిలో మళ్లీ ఆశలు పెరిగాయి. మాజీ కేంద్ర మంత్రి అశోక్ గజపతి రాజుకు గవర్నర్ పదవి దక్కడంతో తనకు కూడా పార్టీ హైకమాండ్ ఏదో ఒక పదవి ఖచ్చితంగా ఇస్తుందన్న నమ్మకం పెరిగిపోయిందట. అశోక్ గజపతిరాజు లాగానే తాను కూడా పార్టీలో సీనియర్ నేత కావడంతో పాటు క్లిష్ట సమయంలో చంద్రబాబు కు అండగా నిలబడటంతో తనకు ఖచ్చితంగా పదవి లభిస్తుందన్న భావనలో ఉన్నారు. అశోక్ గజపతి రాజు కుమార్తె అదితి గజపతి రాజుకు కూడా గత ఎన్నికల్లో విజయనగరం టిక్కెట్ ఇవ్వగా, యనమల కుమార్తె దివ్యకు తుని నియోజకవర్గం టిక్కెట్ ఇచ్చింది. తునిలో యనమల దివ్య గెలిచింది. సుదీర్ఘకాలం తర్వాత తుని నియోజకవర్గంలో టీడీపీ గెలిచింది. ఎమ్మెల్సీ పదవి ఇవ్వకపోవడంతో తనకు పెద్దల సభకు పంపాలని యనమల రామకృష్ణుడు బలంగా కోరుకుంటున్నారు. పార్టీ కోసం ఇప్పటి వరకూ తాను చేసిన కృషి, పడిన శ్రమను హైకమాండ్ గుర్తించకపోతుందా? అని యనమల బలంగా నమ్ముతున్నారు. అందుకే ప్రస్తుతం యనమల రామకృష్ణుడు మౌనంగానే ఉంటున్నారు. అదే సమయంలో తుని నియోజకవర్గానికే పరిమితమయ్యారు. అలాగని వైసీపీ అధినేత వైఎస్ జగన్ మీద విమర్శలు మానుకోలేదు. అంటే ఖచ్చితంగా చంద్రబాబు తనవైపు చూస్తారని యనమల గట్టిగా విశ్వసిస్తున్నారు. తనలాంటి సీనియర్ నేతలను, సామాజికవర్గానికి చెందినవారిని పక్కన పెట్టే అవకాశం లేదని కూడా అంచనా వేస్తున్నారు. అధికారంలోకి వచ్చిన ప్రతిసారీ... ఆయన వయసుతో పాటు కొన్ని ప్రత్యేక పరిస్థితులు టీడీపీ అధినాయకత్వం మంత్రిపదవికి దూరం పెట్టింది. టీడీపీ అధికారంలోకి వచ్చిన ప్రతిసారీ యనమల రామకృష్ణుడు మంత్రి పదవిలో ఉంటారు. ఆయనకు తూర్పు గోదావరి జిల్లా నుంచి నియోజకవర్గం ఫిక్స్ అయినట్లేనని ఎవరైనా లెక్కలు వేసుకుంటారు. పైగా చంద్రబాబుకు యనమల అత్యంత సన్నిహితుడిగా ముద్రపడింది. అనేక కష్ట సమయాల్లో పార్టీకి అండగా నిలిచారన్న పేరు కూడా పార్టీలో యనమల రామకృష్ణుడికి ఉంది. సీనియర్ నేత అయినా ఆయన సేవలను ఉపయోగించుకుంటారని అందరూ భావించారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యనమల రామకృష్ణుడుకు మంత్రివర్గంలో చోటు దక్కకపోవడంతో అప్పుడే కొంత సందిగ్ధత మొదలయింది.. గత వైసీపీ హయాంలో మూడు రాజధానుల ప్రతిపాదన పెట్టినప్పుడు యనమల రామకృష్ణుడు శాసనమండలిలో తన రాజకీయ చతురతను ఉపయోగించి బిల్లు ఆమోదం పొందకుండా అడ్డుకోగలిగారు. ఇలా ఎలా చూసినా యనమల రామకృష్ణుడికి పదవి గ్యారంటీ అన్న ప్రచారం ఊపందుకుంది. మరొక వైపు అశోక్ గజపతిరాజుకు కూటమి ప్రభుత్వం ఏర్పాటయిన ఏడాది తర్వాత గోవా గవర్నర్ గా నియమించడంతో ఇక తనను కూడా ఇటు రాజ్యసభ కు కాని, అటు గవర్నర్ గా పంపుతారన్న నమ్మకం యనమల రామకృష్ణుడి వర్గంలో పెరిగిపోయింది. అందుకే ఇక యనమల రానున్న రోజుల్లో మరింత యాక్టివ్ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరి హైకమాండ్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటున్నది భవిష్యత్ లో తేలనుంది.



# లిక్కర్ ఫైల్స్ ...కొలిక్కి వచ్చినట్టేనా

విజయవాడ, జూలై 16,అసలు ఎపిసోడ్ ఇప్పుడే స్టార్ట్ అయింది. అరెస్టులు, విచారణలు, కస్టడీలు..ఇవన్నీ ఆల్‌మోస్ట్ కంప్లీట్ అయినట్లే. కానీ కీలక దశలో ఉన్న లిక్కర్ కేసులో నిందితులకు బెయిల్ రాకుండా అడ్డుకోవడమే సిట్ ముందున్న ప్రధాన లక్ష్యం. అందుకోసం కోర్టులో సబ్‌మిట్ చేసేందుకు పకడ్బందీగా ఆధారాలు సేకరిస్తోందట సిట్. ముడుపుల వ్యవహారం ఏంటి..ఎవరెవరికి లింకులు ఉన్నాయి..ఏ నెంబర్ కార్లు వాడారు..ఫోన్ సంభాషణలు ఏంటి..ఇలా ప్రతీ ఒక్కటి పక్కా స్కెచ్ ప్రకారం జరిగిందని ప్రూవ్ చేసేందుకు తీవ్ర కసరత్తే చేస్తోందట సిట్ టీమ్. లేటెస్ట్ టెక్నాలజీతో మద్యం ముడుపుల వీడియోలను సేకరించినట్లు తెలుస్తోందిడెన్లలో దాచిన డబ్బులు, వాటిని నిందితులు సెల్‌ఫోన్లలో షూట్ చేసిన వీడియోలు దొరికినట్లు చెబుతున్నారు. నిందితుల నుంచి అధికారులు స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్ల నుంచి ఈ వీడియోలను స్వాధీనం చేసుకున్నారని అంటున్నారు. ఎన్నికల తర్వాత నిందితులు ముందు జాగ్రత్తగా తమ సెల్‌ఫోన్ల నుంచి ఆ వీడియోలను డిలీట్ చేశారట. అధికారులు ఆ సెల్‌ఫోన్లను ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీకి పంపి డిలీట్ చేసిన వీడియోలను రిట్రీవ్ చేశారని చెప్పుకుంటున్నారు.మద్యం డీలర్ల నుంచి ముడుపులు వసూలు చేశాక పెద్దలకు చేరవేసేవరకు..అంతా లిక్కర్ స్కామ్‌లో కీలక సూత్రధారిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న రాజ్ కసిరెడ్డి డైరెక్షన్‌లో జరిగిందట. నిందితులు లిక్కర్ సొమ్ము పంపిణీకి ముందు వీడియోలు తీశారని అంటున్నారు. డెన్లలో దాచిన డబ్బుల వివరాలను సెల్‌ఫోన్లలో వీడియోలు తీసి పెట్టుకున్నారట. ఎన్నికల తర్వాత అలర్ట్ అయిన రాజ్ కసిరెడ్డి తాను ఏర్పాటు చేసుకున్న వసూళ్ల నెట్‌వర్క్‌లోని ప్రతి వ్యక్తినీ హైదరాబాద్‌కు పిలిపించి వారి సెల్‌ఫోన్లు తీసుకున్నాడని విచారణలో తేలిందంటున్నారు.ప్రతి ఫోన్‌కూ కనీసం లక్ష రూపాయలకు తగ్గకుండా ఇచ్చి కొత్త ఫోన్ తీసుకోవాలని సూచించాడట. ఇక లిక్కర్ ఆర్డర్లు పెట్టిన కంప్యూటర్లను డిపోల్లో ధ్వంసం చేశారట. అయినా కొన్ని వీడియో ఫుటేజ్‌లతో పాటు చాటింగ్‌లు, ఫొటోలు బయటపడ్డట్లు తెలుస్తోంది. సిట్ అధికారులు త్వరలో దాఖలు చేయనున్న చార్జిషీట్‌లో ఈ ఆధారాలను పొందుపరచనున్నట్లు తెలుస్తోంది.లిక్కర్ కేసులో ఓ స్కెచ్ ప్రకారం దోపిడీ జరిగిందని విచారణలో తేలిందంటున్నారు. సిట్ ఇప్పటి వరకూ 40 మందిని నిందితులుగా చేర్చింది. రాజ్ కసిరెడ్డితో పాటు మాజీ సీఎం జగన్ సెక్రటరీ ధనుంజయ్ రెడ్డి, వైసీపీ

## ఇవాళ చార్జిషీట్ దాఖలు

నేత చెవిరెడ్డి భాస్కర్ రెడ్డితో పాటు తొమ్మిది మందిని అరెస్టు చేసింది. సాక్షులు, అనుమానితులను 200మందికి పైగా విచారించింది. ఈ కేసులో భాగస్వామ్యం ఉన్న పది మందికిపైగా విదేశాలకు పారిపోయారు. ఈ కేసు విచారణలో మూడు నెలలకు పైగా సిట్ సేకరించిన ఆధారాలు ఈ నెల 17న విజయవాడ ఏసీబీ కోర్టుకు చేరనున్నాయి.మద్యం ముడుపుల వసూళ్లు, డెన్‌లలో దాచడం, కీలక వ్యక్తులకు పంపడం, ఎన్నికల్లో అభ్యర్థులకు పంపిణీ చేయడం, కీలక వ్యక్తుల పాత్ర, బినామీల ఆస్తులు, హవాలా మార్గంలో విదేశాలకు తరలించడం వంటివి చార్జిషీట్‌లో మెన్షన్ చేసే అవకాశం ఉందంటున్నారు. పది రోజులకు పైగా ఇదే పనిలో బిజీగా ఉన్న సిట్ అధికారులు లీగల్ ఎక్స్‌పర్ట్స్‌తో చర్చిస్తున్నారట. సూత్రధారులెవరు, పాత్రధారులెవరనే దానిపై టెక్నికల్ ఎవిడెన్స్‌తో పక్కా ఆధారాలను సేకరించి కోర్టులో చార్జిషీట్ వేయబోతున్నారట.ఎక్సైజ్ అధికారులు, గత ప్రభుత్వ పెద్దలు, వైసీపీ నేతల పాత్రపై కూడా ఇప్పటివరకు తాము కలెక్ట్ చేసి అన్ని ఎవిడెన్స్‌ను సిట్ కోర్టుకు సబ్‌మిట్ చేయబోతున్నట్లు తెలుస్తోంది. ఈ నెల 21 నాటికి రిమాండ్ ఖైదీగా రాజ్ కసిరెడ్డి జ్యుడీషియల్ కస్టడీ 90 రోజులు పూర్తి అవుతుంది. ఈ లోపు చార్జిషీట్ వేయకపోతే డిఫాల్ట్‌గా బెయిల్ వస్తుంది. దీంతో ప్రధాన నిందితుడిగా అలిగేషన్స్ ఫేస్ చేస్తున్న రాజ్‌కసిరెడ్డి బయటికి వస్తే..కేసు మొత్తం తారుమారైపోతుందని సిట్ భావిస్తోందట. అందుకే చాలా పకడ్బందీగా..లీగల్ ఎక్స్‌పర్ట్స్ ఒపీనియన్‌తో చార్జిషీట్ దాఖలు చేయనున్నట్లు సమాచారం.ఓ వైపు విజయసాయిరెడ్డి సిట్ విచారణ బాకీ ఉంది. ఇప్పటికే ఆయన ఓ సారి సిట్ ముందుకెళ్లి..ఇన్ అండ్ ఔట్ అంతా చెప్పేసి..అందరినీ ఇరకాటంలో పెట్టేశారు. ఇప్పుడు మరోసారి ఆయన సాక్షిగా సిట్ ముందు హాజరుకాబోతున్నారు. ఈసారి విజయసాయి ఏం చెప్తారనే టెన్షన్ ఓ వైపు కొనసాగుతూనే ఉంది. ఇక ఇప్పుడు ఛార్జిసీట్ అంశం ఇంకా ఉత్కంఠ రేపుతోంది. రాజ్‌కసిరెడ్డికి బెయిల్ రావడం..రాకపోవడం పక్కన పెడితే..ఆయనతో ఎవరికి లింకులు ఉన్నాయని సిట్ ఆరోపిస్తుందో..ఎలాంటి ఆధారాలను బయటపెడుతుందోనన్న ఆందోళన అయితే ఫ్యాన్ పార్టీ పెద్దల్లో కనిపిస్తుందంటున్నారు. కీలకంగా మారిన విజయసాయి విచారణ..సిట్ ఛార్జిషీట్ తర్వాత ఏం జరగబోతోందో చూడాలి మరి.

# బూస్టర్ లా భోగాపురం



విజయనగరం, జూలై 16,విజయనగరం జిల్లాలో నిర్మాణంలో ఉన్న భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రాజెక్ట్ పూర్తయితే.. ఉత్తరాంధ్ర రూపురేఖలే మారిపోనున్నాయ్. భోగాపురంలో ఎయిర్‌పోర్ట్ అందుబాటులోకి వస్తే.. ఆ ప్రాంతమే కాదు చుట్టపక్కల ఉన్న మిగతా ప్రాంతాలు కూడా అభివృద్ధి చెందుతాయ్. ఈ ప్రాజెక్టుతో రవాణా సౌకర్యాన్ని మెరుగుపరచడమే కాదు.. పారిశ్రామిక, ఆర్థిక, సామాజిక రంగాల్లో విప్లవాత్మక మార్పులకు బీజం పడనుంది. అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం.. అదే.. భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్.. విజయనగరంలో జిల్లాలో ఈ విమానాశ్రయం పూర్తయితే.. ఉత్తరాంధ్ర లెక్కే మారిపోతుందనే మాటలు వినిపిస్తున్నాయి. అటు విశాఖ, ఇటు శ్రీకాకుళానికి మధ్య ఉన్న విజయనగరాన్ని కలిపేలా.. ఈ ఎయిర్‌పోర్ట్‌ని నిర్మిస్తున్నారు. ఎన్‌హెచ్-16కి ఆనుకొని దీనిని నిర్మిస్తుండటం.. మరో మేజర్ ప్లస్ పాయింట్. ఇప్పటికే.. ఎయిర్‌పోర్ట్ పనులు సుమారు 80 శాతం వరకు పూర్తయ్యాయి. వచ్చే ఏడాది జూన్ నాటికి.. భోగాపురం ఎయిర్‌పోర్ట్‌ను అందుబాటులోకి తీసుకురావాలని.. ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఎయిర్‌పోర్ట్ పనుల్లో కదలిక. ఎయిర్‌పోర్ట్ పనులు వేగంగా సాగుతుండటంతో.. పదేళ్లుగా పడకేసిన రియల్ ఎస్టేట్ రంగం మళ్లీ ఇప్పుడిప్పుడే ఊపందుకుంటోంది. 2014లో టీడీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక.. ఎయిర్‌పోర్ట్ నిర్మాణ ప్రతిపాదన వచ్చింది. దాంతో.. రియల్టర్లంతా పెద్ద ఎత్తున లేఅవుట్‌లు వేసుకున్నారు. తర్వాత వైసీపీ హయాంలో భోగాపురం ఎయిర్‌పోర్ట్ క్వశ్చన్ మార్క్‌లా మారింది. మళ్లీ కూటమి ప్రభుత్వం వచ్చాక.. విమానాశ్రయ పనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతుండటంతో.. రియల్టర్లలో మళ్లీ ఆశలు చిగురించాయి. భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుతో.. భోగాపురం ఎయిర్‌పోర్ట్ నిర్మాణం వల్ల ఉద్యోగ అవకాశాలు భారీగా పెరగనున్నాయి. ఎయిర్‌పోర్ట్ మెయింటెనెన్స్, లాజిస్టిక్స్, హాస్పిటాలిటీ, రిటైల్ లాంటి రంగాల్లో.. వేలాది మందికి ఉపాధి లభిస్తుంది. పారిశఅరామికంగా, విమానాశ్రయానికి సమీపంలో కొత్త పరిశ్రమలు, గోడౌన్‌లు, వ్యాపార సంస్థలు ఏర్పడతాయి. ఇది.. ఆ ప్రాంతంలో పారిశ్రామిక అభివృద్ధికి ఊతమివ్వడంతో పాటు స్థానిక ఆర్థిక వ్యవస్థని బలోపేతం చేస్తుందని చెబుతున్నారు. ఉత్తరాంధ్రలో ఉద్యోగ కల్పనే ధ్యేయంగా ముందుకు. ఇదిలా ఉంటే.. ముఖ్యమంత్రి చంద్రబాబు ఫ్యూచర్ అంతా టూరిజందే అంటున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో.. పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టాలని ఇన్వెస్టర్లను కోరుతున్నారు. భోగాపురం, పూసపాటిరేగ మండలాల తీర ప్రాంతాల్లో.. టూరిజాన్ని డెవలప్ చేసేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు. ఫైవ్ స్టార్ హోటళ్ల నుంచి బీచ్‌లో కాటేజీల దాకా అన్నింటిపైనా ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. టూరిజంతో పాటు ఐటీ సెక్టార్, ఇంజనీరింగ్ పరిశ్రమల్ని అభివృద్ధి చేసి.. ఉత్తరాంధ్రలో ఉద్యోగ కల్పనే ధ్యేయంగా ముందుకు సాగుతోంది కూటమి ప్రభుత్వం.భోగాపురం ఎయిర్‌పోర్ట్ అందుబాటులోకి వస్తే.. భోగాపురం ఎయిర్‌పోర్ట్ అందుబాటులోకి వస్తే.. ఉత్తరాంధ్రలో టూరిజం బాగా డెవలప్ కానుంది. విజయనగరం జిల్లా సమీపంలోని టూరిస్ట్ స్పాట్‌లకు.. దేశీయ, అంతర్జాతీయ పర్యాటకుల రాకపోకలు పెరుగుతాయి. దాంతో.. హోటల్స్, రిసార్ట్స్, రెస్టారెంట్ల లాంటి హాస్పిటాలిటీ రంగం డెవలప్ అవుతుంది. మౌలిక సదుపాయాల కల్పనలోనూ ఊహించని మార్పులొస్తాయ్. రోడ్లు, కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లు, కరెంట్ సప్లై లాంటివన్నీ మెరుగుపడతాయి. మొత్తంగా.. భోగాపురం ఎయిర్‌పోర్ట్ విజయనగరం జిల్లాని ఓ ముఖ్యమైన ఎకనమిక్ జోన్‌గా మార్చి.. ఆ ప్రాంత సమగ్ర అభివృద్ధికి బూస్టర్‌లా మారనుంది

# ఎవ్వరికి పట్టని ఆదిమూలం

తిరుపతి, జూలై 16, కొందరు రాజకీయ నేతలకు పాపం.. ఏ పార్టీలో ఉన్నా సుఖం ఉండదు. ఎమ్మెల్యేగా గెలిచారన్న మాటే కానీ వారు వార్డు సభ్యుడి కంటే హీనంగా చూస్తారు. అందులోనూ రిజర్వ్ డ్ నియోజకవర్గాల్లో ఇటువంటి పరిస్థితి ఉంది. ఏ పార్టీ అధికారంలో ఉన్నా రిజర్వ్ డ్ నియోజకవర్గాల్లో గెలిచిన ఎమ్మెల్యేలు ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోవాల్సిందే. అది వైసీపీ అధికారంలో ఉంటే రెడ్డి సామాజికవర్గం నేతలు ఆధిపత్యం వహిస్తారు. టీడీపీ అధికారంలో ఉంటే కమ్మ సామాజికవర్గం నేతలు పెత్తనం చేస్తారు. ఫలితం మాత్రం సేమ్ టు సేమ్. అక్కడ ఎమ్మెల్యేల మాట చెల్లుబాటు కాదు. పార్టీని నడిపించే అధికార పార్టీ నేతల మాటకే విలువ ఉంటుంది. అధికారులు సయితం వారికే సెల్యూట్ కొడతారు.రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచినా... చిత్తూరు జిల్లా సత్యవేడు నియోజకవర్గం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా ఏ మాత్రం లేదు. సత్యవేడు నియోజకవర్గం నుంచి కోనేటి ఆదిమూలం 2019 ఎన్నికల్లో వైసీపీ నుంచి గెలిచారు. అయితే అధికారంలో ఉన్న ఐదేళ్ల పాటు ఆయన మాట చెల్లుబాటు కాలేదు. అంతా అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పెత్తనమే నడిచింది. తన నియోజకవర్గం కాకపోయినా చిత్తూరు జిల్లా కావడంతో పెద్దిరెడ్డి చెప్పినట్లు అధికారులు నడుచుకునే వారు. ఆదిమూలం మాత్రం పేరుకు ఎమ్మెల్యేగా ఉన్నా ఏ ప్రయోజనమూ లేదు. పెద్దిరెడ్డితో కోనేటి ఆదిమూలం విభేదించడంతో ఆయనను తిరుపతి పార్లమెంటు నియోజకవర్గం ఎంపీగా పోటీ చేయాలని అన్నారు. దీనికి ఇష్టపడని ఆదిమూలం టీడీపీలో చేరిపోయారు.. టీడీపీ నుంచి 2024 ఎన్నికల్లో టిక్కెట్ తెచ్చుకున్న కోనేటి ఆదిమూలం రెండోసారి కూడా గెలిచారు. అయినా పరిస్థితుల్లో ఏమాత్రం మార్పురాలేదు. ఆయనపై లైంగిక వేధింపుల కేసు నమోదయింది. దీంతో తెలుగుదేశం పార్టీ ఆదిమూలం కోనేటిని సస్పెండ్ చేసింది. సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంపై కేసు నమోదయింది. తనపై కుట్ర జరిగిందని ఆయన చెప్పినప్పటికీ పోలీసులు కేసు నమోదు చేశారు. తర్వాత న్యాయస్థానంలో బాధితురాలు ఆ కేసును విత్ డ్రా చేసుకోవడంతో ఆదిమూలం కోనేటి పై కేసును కొట్టి వేశారు. కేసు ఏమీ లేదని తెలిసిన తర్వాత, బాధితురాలు స్వయంగా ప్రకటన చేసిన తర్వాత కూడా కోనేటి ఆదిమూలం పరిస్థితుల్లో మార్పు రాలేదు. దీంతో కోనేటి ఆదిమూలంకు కోపం నషాళానికి అంటింది. ఎంతమంది తనపై పెత్తనం చలాయిస్తారంటూ మండిపడ్డారు. కొద్ది రోజులుగా తనా? పార్టీకి దూరంగా ఉంటే నియోజకవర్గంలో ఎవరు పడితే వాళ్లు వస్తారా? అని ఆయన నిన్న ప్రశ్నించారు. స్థానిక ఎమ్మెల్యేకు కాకుండా పార్టీలో ఉన్న ఇతరులకు పోలీసులు ఎలా సెల్యూట్ కొడతారంటూ ఆదిమూలం కోనేటి మండిపడ్డారు. ప్రజల ఓట్లతో గెలిచిన తనను కాదని, ఒకరు కో- ఆర్డినేటర్ గా, మరకొరు పరిశీలకుడిగా చెప్పుకుంటూ నియోజకవర్గంలో పనులన్నీ చక్కబెట్టుకుంటున్నారని, తనపై తప్పుడు ప్రచారం చేసిన వారినే వీరు వెనకేసుకు వస్తున్నారని ఆదిమూలం కోనేటి ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ఆదిమూలం ఆవేదన పట్టించుకునే వారెవరు?



# మరొక జాతీయరహదారికి మహర్దశ

కర్నూలు, జూలై 16,ఆంధ్రప్రదేశ్‌లో జాతీయ రహదారుల వెంబడి ఉన్న గ్రామాలు, పట్టణాల రోడ్ల అభివృద్ధిపై ఫోకస్ పెట్టారు.. గతంలో జాతీయ రహదారుల వెంబడి బైపాస్ రోడ్లు వేశారు.. అయితే వాటిని పట్టించుకోలేదు. తాజాగా కేంద్రం నిధులు ఇస్తుండటంతో అధికారులు వాటి అభివృద్ధికి ప్రణాళికలు వేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఉన్న జాతీయ రహదారుల అనుసంధాన రోడ్లను అభివృద్ధి చేయడానికి అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. నంద్యాల-చిత్తూరు (నేషనల్ హైవే-40), కర్నూలు-గుంటూరు (340సీ), సోమయాజులపల్లె-డోన్ (340బీ), నేషనల్ హైవే 167, నేషనల్ హైవే-44, చెన్నై-సూరత్ 150సీ జాతీయ రహదారుల వెంబడి బైపాస్ రోడ్లను అభివృద్ధి చేయనున్నారు. ఈ రోడ్ల అభివృద్ధికి నిధులు ఇవ్వాలని కేంద్రం నిర్ణయించడంతో అధికారులు అంచనాలు రూపొందించారు.నేషనల్ హైవే-40 పరిధిలో నంద్యాల,

ఆళ్లగడ్డ బైపాస్ రోడ్ల అభివృద్ధికి రూ.10 కోట్లు అవుతుందని అంచనా వేశారు. దీనితో పాటుగా 340బీ సోమయాజులపల్లె-డోన్ రహదారిలో బేతంచెర్ల, డోన్ బైపాస్ రోడ్లకు నిధులు కేటాయించారు. కర్నూలు-గుంటూరు 340సీ రహదారిపై నన్నూరు టోల్‌ప్లాజా దగ్గర ఉన్న బైపాస్‌ను కూడా అభివృద్ధి చేస్తారు. కర్నూలు జిల్లాలో బళ్లారి-రాయచూరు నేషనల్ హైవే 167కు సంబంధించి.. హాలహర్వి-మాధవరం వరకు 58 కిలోమీటర్ల రోడ్డులో ఆదోని వద్ద బైపాస్‌కురూ.5 కోట్లు అవసరమని అంచనా వేశారు. బెంగళూరు-హైదరాబాద్ నేషనల్ హైవే-44కు రూ.10 కోట్లు కావాలని అధికారులు అంచనా వేశారు. చెన్నై-సూరత్ 150సీ రహదారికి సంబంధించి రూ.10 కోట్లు అవసరమని అంచనాలు సిద్ధం చేశారు వర్షాకాలంలో జాతీయ రహదారుల నుంచి బైపాస్ మార్గాలకు వెళ్లే రోడ్లపై నీళ్లు నిలిచిపోతున్నాయి. ఈ కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనికి తోడు మురుగు కాల్వలు లేకపోవడంతో నీరు రోడ్లపై నిలుస్తుండటంతో రోడ్లు కూడా పాడైపోతున్నాయి. ఈ క్రమంలోనే కేంద్రం వన్ టైమ్ ఇంప్రూవ్మెంట్ నిధులు ఇస్తోంది.. వీటితో రోడ్లకు ఇరువైపులా మురుగు కాల్వల నిర్మాణం కూడా చేపడతారు. మొత్తం మీద కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయంతో ఉమ్మడి కర్నూలు జిల్లాలో నేషనల్ హైవేల నుంచి గ్రామాలు, పట్టణాలకు కనెక్టివిటీ పెరగనుంది.

# వలంటీర్ల వ్యవస్థ...కామా కాదు... ఫుల్ స్టాప్...

గుంటూరు, జూలై 16, ఏపీలో కూటమి సర్కార్ వచ్చిన తర్వాత వాలంటీర్ల వ్యవస్థను సైడ్ చేశారు. వాలంటీర్లు సేవలను వాడకుండానే పెన్షన్లను ఇచ్చేస్తున్నారు. రేషన్ బండ్లతో పనిలేకుండానే సరుకుల్ని పంచేస్తున్నారు. ఏపీలో ఇక వాలంటీర్ల అవసరం లేకుండా పోయింది. వాలంటీర్ల వ్యవస్థ వల్లే వైసీపీకి నష్టం జరిగిందని అన్ని సర్వేలు చెబుతున్నాయి. ఇటు వైసీపీ సైతం అదే నిజమని భావిస్తోంది. అందుకే కూటమి సర్కార్ కూడా వాలంటీర్ల వ్యవస్థను టచ్ చేయడం లేదట.వాలంటీర్ల వ్యవస్థ విషయంలో వైసీపీ కూడా ఓ క్లారిటీకి వచ్చేసినట్టు ఆ పార్టీ నేతలు బహిరంగ ప్రకటనలు చేస్తున్నారు. మాజీ సీఎం జగన్ ఇక నుంచి వాలంటీర్ల వ్యవస్థ జోలికి వెళ్లకూడదని నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. తాజాగా దీనిపై వైసీపీ మాజీ ఎమ్మెల్యే పార్టీ అంతర్గత మీటింగ్‌లో మాట్లాడారని తెలుస్తోంది. వాలంటీర్ల వ్యవస్థ పై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఒక నిర్ణయం తీసుకున్నట్లు చెప్పుకొచ్చారాయన. వాలంటీర్ల వ్యవస్థ అనేది ముగిసిన అధ్యాయం కానుంది. కూటమి ప్రభుత్వమే కాదు భవిష్యత్‌లో వైసీపీ కూడా వాలంటీర్ వ్యవస్థ జోలికి పోయేలా కనిపించడం లేదు. ఆ వ్యవస్థతోనే వైసీపీకి దారుణ పరాజయం ఎదురైందని ఆ పార్టీ శ్రేణులు భావిస్తున్నారట.నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఇటీవల పార్టీ శ్రేణులతో కీలక వ్యాఖ్యలు చేశారు. వాలంటీర్ వ్యవస్థ వల్ల వైసీపీ ప్రజాప్రతినిధులు ప్రజలకు దూరమయ్యారని అన్నారు. తాను పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి దగ్గర ఇదే విషయాన్ని ప్రస్తావించానని చెప్పుకొచ్చారు. ఏ పార్టీకైనా కార్యకర్తలే మూలస్తంభాలని, వాలంటీర్లు కాదని హైకమాండ్‌కు చెప్పారట.వైఎస్సార్ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మరోసారి వలంటీర్ వ్యవస్థ జోలికి వెళ్ళవద్దని విజ్ఞప్తి చేసినట్లు స్వయంగా పార్టీ సమావేశంలోనే చెప్పారట. అయితే మాజీ ఎమ్మెల్యే అభిప్రాయాన్ని ఆ పార్టీ శ్రేణులందరూ ముక్తకంఠంతో ఆహ్వానించారట. రాష్ట్రవ్యాప్తంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులంతా ఇదే అభిప్రాయంతో ఉన్నారని పార్టీ వర్గాల్లో వినిపిస్తున్న టాక్. 2019లో అధికారంలోకి వచ్చిన వెంటనే వలంటీర్ వ్యవస్థను ప్రారంభించింది వైసీపీ ప్రభుత్వం. ప్రతి 50 కుటుంబాల బాధ్యతను వారికి అప్పగించింది. దీంతో వైసీపీ నాయకత్వానికి, పార్టీ శ్రేణులకు పని లేకుండా పోయింది.ప్రభుత్వం అంటే వలంటీర్ వ్యవస్థ అనే భావన ప్రజల్లో పాతుకుపోయింది. ప్రతి చిన్న అవసరానికి జనం వాలంటీర్ల చుట్టూ తిరిగారు. వైసీపీ క్యాడర్, స్థానిక నేతలకు ప్రజలతో గ్యాప్ ఏర్పడింది. అప్పట్లో వాలంటీర్ వ్యవస్థపై వైసీపీ ప్రజా ప్రతినిధులే పెద్ద ఎత్తున ఫిర్యాదులు చేశారు. కానీ మాజీ సీఎం జగన్ లెక్క చేయలేదు. సరిగ్గా ఎన్నికల ముందు వాలంటీర్ వ్యవస్థను నిలిపివేసింది ఎన్నికల కమిషన్. దీంతో చాలామంది వాలంటీర్లు రాజీనామాలు చేశారు. అయితే కూటమి అధికారంలోకి వస్తే వాలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తామని.. రాజీనామాలు చేయవద్దని విజ్ఞప్తితో.. సగం మంది రాజీనామాలు చేయలేదు.అయితే కూటమి అధికారంలోకి వచ్చి ఏడాదన్నర అవుతోంది. కానీ వాలంటీర్ వ్యవస్థపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీనిపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సైతం పెద్దగా మాట్లాడడం లేదు. వాలంటీర్ వ్యవస్థ మూలంగానే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి నష్టం జరిగిందన్నది మెజారిటీ పార్టీ శ్రేణుల అభిప్రాయపడుతున్నారు.ఒకవేళ ఇప్పుడు వాలంటీర్ వ్యవస్థను సమర్థిస్తే.. భవిష్యత్తులో అధికారంలోకి వచ్చిన వెంటనే దానిని అమలు చేయాల్సి ఉంటుంది. అలా చేస్తే ఎలాంటి పరిణామాలు ఎదురవుతాయో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకత్వం డైలామాలో ఉందట. అందుకే ఈ వ్యవస్థ విషయంలో కూటమి బాటలోనే నడవాలని వైసీపీ నిర్ణయించుకుందని పొలిటికల్ సర్కిళ్లలో మెయిన్ డిబెట్ పాయింట్‌గా మారింది.ఫైనల్‌గా వాలంటీర్ల వ్యవస్థకు తెరపడినట్లేనన్న టాక్ వినిపిస్తోంది. భవిష్యత్‌లో కార్యకర్తలకే ప్రయారిటీ ఇస్తామని స్వయంగా పార్టీ అధినేత జగన్ అంటున్నారు. అంటే వాలంటీర్లు ఉండరని చెప్పకనే చెప్తున్నారు జగన్. అలా అధికార, అపోజిషన్ వార్ మధ్య వాలంటీర్ వ్యవస్థ కనుమరుగైనట్లేనన్న ఒపీనియన్స్ వ్యక్తం అవుతున్నాయి.

## చివరి ఆయ కట్టు వరకు తెలుగు గంగా నీరు : పిసి చైర్మన్ సంజీవ్ కుమార్ రెడ్డి



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 16-తెలుగు గంగ నీరు చివరి ఆయకట్టు వరకు నీరు అందిస్తామని తెలుగు గంగ పిసి చైర్మన్ సంజీవ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. తెలుగు గంగ సులూయిస్ (తూములను ) పిసి చైర్మన్ సంజీవ్ కుమార్ రెడ్డి ,తెలుగు గంగ ఈఈ దశరథ రామ్ రెడ్డి. గాజులపల్లి దగ్గర ఉన్న 14వ సులూయిస్ బుధవారం తెరిచారు. ఈ సందర్భంగా తెలుగు గంగ పిసి చైర్మన్ సంజీవ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రైతుల కోసం తూమును తెరవడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వంలో ఒక నెల ముందే రైతులకు నీళ్లు అందిస్తున్నా ఘనత చంద్రబాబు నాయుడుకే దక్కిందన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు గంగమ్మకు సారే ,చీరే సమర్పించి పూజ నిర్వహించి సులూయిస్ ఓపెన్ చేయడం జరిగిందన్నారు. బనకచర్లకు నీరు వచ్చేలా కృషి చేస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు కు రైతుల తరపున ధన్యవాదాలు తెలియజేశారు, ఈఈ దశరథ రమిరెడ్డి మాట్లాడుతూ శ్రీశైలం, ఆళ్లగడ్డ ,నంద్యాల నియోజకవర్గంలోని 43,946 36 ఎకరాల ఆయకట్టుకు తెలుగంగద్వారా నిరందించడం జరుగుతుందన్నారు . తెలుగుగంగ 10 నుంచి 20 వ సులూయిస్ వరకు ఈ రోజు తెరటం జరిగిందన్నారు , ప్రతి రైతుకుచివరిఆయకారకట్టువరకునీరుఅందించేప్రయత్నం చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో డీసీ క్రాంతికుమార్, డబ్యూఏ ప్రెసిడెంట్ లు అశోక్ కుమార్ రెడ్డి,మహేశ్వర రెడ్డి,డీఈ లు ఓబుల్ రెడ్డి,వేంకట రెడ్డి , సామెయిల్, ఎఇలు లు రమేష్,కుమారి,టిసి మెంబెర్లు,రైతులు పాల్గొన్నారు

## త్రాగునీటి కి వీధిలైట్లకు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు:కమిషనర్ బండి శేషన్న




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 16-నంద్యాల పట్టణంలో మున్సిపాల్టీ త్రాగునీటి కి వీధిలైట్లకు ఎవరైన ఆటంకాలు కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న హెచ్చరించారు. బుధవారం ఆయన ఒ ప్రకటన విడుదల చేశారు. పట్టణంలో వాటర్ టర్న్ క్లాక్స్ మరియు స్ట్రీట్ లైటింగ్ ఉద్యోగులు సమ్మెలో ఉన్నందున వాటర్ పిట్స్ నందు ( రాళ్ళు వేయడం ) దాని వల్ల పట్టణంలోనీ పలు వార్డుల నందు నీటి సరఫరా అంతరాయం ఏర్పడిందన్నారు . అలాగే స్ట్రీట్ లైట్స్ మీటర్ బాక్స్ వద్ద ( వైర్ కటింగ్) డ్యామేజ్ వంటివి చేయటం వల్ల వీధి దీపాలు వెలగడం లేదన్నారు . ఎవరైనా అనధికార వ్యక్తులు ఉద్యోగులు ఏదైనా ఆటంకం కలిగిస్తున్నట్టుగా అనుమానం వస్తె ఫొటోస్/ వీడియోలు 7702776048 నెంబర్ కి సమాచారం తెలియ జేయాలని కోరారు .

## సొసైటీ ని ఆభివృద్ధి దిశగా కృషి చేయాలి ఎన్ఎండి ఫయాజ్

--విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 16-నూతనంగా ఎన్నికైన ప్రతినిధులు సొసైటి అభివృద్ధి కోసం కృషి చేయాలని నంద్యాల టిడిపి నాయకులు ఎన్ఎండి ఫయాజ్ పేర్కొన్నారు. నంద్యాల నియోజకవర్గ గోస్పాడు, దీబగుంట్ల సొసైటీల అధ్యక్షులుగా నూతనంగా ఎన్నికైన గోస్పాడు సొసైటీ అధ్యక్షులు వీరేంద్ర సింహ రెడ్డి , దీబగుంట్ల సొసైటీ అధ్యక్షులు సలిపెల ఓబుల్ రెడ్డి లను బుధవారం నంద్యాల తెలుగుదేశం పార్టీ కార్యాలయం (రాజ్ టాకీస్) నందు టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ ఘనంగా సన్మానించారు . ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ప్రతినిధులు సొసైటీ అభివృద్ధి దిశగా కృషి చెయ్యాలని వారు సూచించారు .




# సింగిల్ డెస్క్ పోర్టల్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి


### జిల్లా రెవెన్యూ అధికారి డి.రాము నాయక్



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 16-ఉత్పాదన, సేవా రంగాల్లోని 25 యూనిట్లకు మొత్తం 96.08 లక్షల విలువైన రాయితీ ప్రయోజనాలను మంజూరు చేయడం జరిగిందని జిల్లా రెవెన్యూ అధికారి డి రాము నాయక్ పేర్కొన్నారు.బుధవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా పారిశ్రామిక మరియు ఎగుమతుల ప్రమోషన్ కమిటీ సమావేశాన్ని జిల్లా రెవెన్యూ అధికారి అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ చిన్న, మధ్యతరహా పరిశ్రమల ప్రోత్సాహం కొరకు పెట్టుబడి రాయితీ, పావలవడ్డీ, విద్యుత్, సేల్ టాక్స్, తదితర రాయితీల క్రింద జిల్లాలో ఉత్పాదన, సేవా రంగాల్లోని 25 యూనిట్లకు మొత్తం 96.08 లక్షలు విలువైన రాయితీ ప్రయోజనాలు మంజూరు చేయడం జరిగిందన్నారు. గత త్రైమాస కాలంలో వివిధ పరిశ్రమల స్థాపనకు అనుమతులు కోసం 116 దరఖాస్తులు అందగా, సింగిల్ డెస్క్ విధానంలో ఆయా శాఖల ద్వారా 94 పరిశ్రమలకు అనుమతులు మంజూరు అయ్యాయని, వాటిలో 22 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయన్నారు. పరిశీలనలో ఉన్న దరఖాస్తులు నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని డిఆర్ఓ సంబంధిత అధికారులను ఆదేశించారు. పిఎం విశ్వకర్మ పథకం క్రింద నమోదైన దరఖాస్తులను పరిశీలించి స్టేజ్-3కి పంపడం జరిగిందన్నారు. "వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్" (ఒక జిల్లా ఒక ఉత్పత్తి)లో భాగంగా జిల్లాలో ఎక్కువ ప్రాముఖ్యత ఉన్న వాటిని పెద్ద ఎత్తున ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి సంబంధిత అధికారులను ఆదేశించారు. అదే విధంగా ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ క్రింద చేపడుతున్న సర్వేను కూడా సంబంధిత అధికారులు పూర్తి చేసేలా చూడాలని సంబంధిత అధికారులను డిఆర్ఓ ఆదేశించారు.సమావేశంలో పరిశ్రమల శాఖ జిఎం ఎస్.మహబూబ్ బాషా, పరిశ్రమల శాఖ డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణ రెడ్డి, ఎల్డీఎం శ్రీ రవీందర్ కుమార్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ కిషోర్ రెడ్డి, ఎస్సీ, ఎస్టీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు రాజమహేంద్రనాథ్, నంది డైరీ మేనేజింగ్ డైరెక్టర్ కల్లూరి రామలింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రంగులు మారుతున్న నంద్యాల రాజకీయం

కులాల కుంపట్లు రాజేస్తున్న రాజకీయ నాయకులు
ఓట్ల బలం ఉన్న నోట్ల దన్ను లేని నేతలు
పురపాలక ఎన్నికల్లో చక్రం తిప్పేందుకు సిద్ధం అవుతున్న కులాల కుంపట్లు



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 16--. : నంద్యాల రాజకీయం మూడు కులాలు ఆరు నోట్లు గా మారిపోయింది. ఎలాగైనా పురపాలక ఎన్నికల్లో చక్రం తిప్పి ఛైర్మెన్ పీఠం దక్కించు కోవాలని ముచ్చటగా మూడు సామజిక వర్గాలు వ్యూహాలు రచిస్తున్నాయి. నంద్యాల లో ఎమ్మెల్యే గా గెలవాలన్న పురపాలక సంఘంలో చక్రం తిప్పాలన్న మూడు సామాజిక వర్గాలకే సాధ్యం. ప్రస్తుతం పురపాలక సంఘం రాజకీయంగా చుస్తే వైకాపా చేతిలో ముస్లిం సామాజిక వర్గం పాలనలో ఉంది. ఇక మొన్న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ తుఫాను లో వైకాపా తుడిచి పెట్టుకో పొగ ముస్లిం మైనారిటీ వర్గానికి చెందిన పెద్దాయన ఫరూక్ గెలవడం మంత్రి పదవి దక్కడం చక చకా జరిగి పోయాయి.ప్రస్తుతం రాజకీయ చిత్రపటంలో పురపాలక ఎన్నికలు సమిపిస్తున్నాయి. తమ పూర్వ వైభవన్నీ దక్కించు కోవాలని వైకాపా, అధికారం అండగా, అభివృద్ధి అజెండాగా టీడీపీ పురపాలనలో చక్రం తిప్పాలని వ్యూవహ రచన చేస్తుండగా, సందట్లో సడేమియా గా అందరిని షాక్ కు గురి చేస్తూ ఆర్య వైశ్య సామజిక వర్గానికి చెందిన సమర్థుడైనా నాయకుడు (జనసేన) పవన్ కళ్యాణ్ పార్టీలో చేరడం తో నంద్యాల రాజకీయం ఒక కుదుపుకు గురైంది. ఓట్ల శాతం తక్కువగా ఉన్న నోట్లతో పుర పిఠాన్ని దక్కించు కోవాలని తాజా రాజకీయాన్ని ఒక మలుపు తిప్పేందుకు జనసేన తీర్థం పుచ్చుకున్న నేతకు సరి తుగే నేత ఓట్ల బ్యాంకులో రెండవ స్థానంలో ఉన్న నాయకుల్లో ఐక్యత లేక పోవడం ఆ సామాజిక వర్గానికి శాపం. నంద్యాల అసెంబ్లీ పరిధిలో గెలుపు వాకిట్లో నిలబడాలంటే ప్రధానంగా ముస్లిం మైనారిటీలు, బలిజ (కాపు), మూడవస్థానంలో ఆర్యవైశ్యులు ఉన్నారు. ఈ మూడు సామిజిక వర్గాల్లో ఎ రెండు సామాజిక వర్గాలు కలిసిన గెలుపు వారి ముంగిట్లో ఉంటుంది.

# నగరానికి 'న్యూ లుక్' తేవాలి


మున్సిపల్ అధికారుల సమీక్షలో మంత్రి టీజీ భరత్
ఆగస్టు ఆఖరు నాటికి పార్కులను తీర్చిదిద్దాలి
రహదారులపై ఎక్కడా గుంతలు కనిపించకూడదు
ప్రగతి పనులు పూర్తి చేయడంలో జాప్యం తగదు





కర్నూలు ,;నగరాన్ని ఆధునిక హంగులతో తీర్చిదిద్ది 'న్యూ లుక్' తేవాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. బుధవారం రాష్ట్ర ప్రభుత్వ అతిథి గృహంలో మున్సిపల్ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. నూతన కమిషనర్ పి.విశ్వనాథపై ఉన్నతాధికారుల్లో మంచి అభిప్రాయం ఉందని, పనితీరు బాగుంటుందని మంత్రి కితాబిచ్చారు. విశాఖపట్నం తరహాలో నగరాన్ని తీర్చిదిద్దేందుకు కలిసికట్టుగా పనిచేయాలని మంత్రి సూచించారు. తమ ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర కాలం పూర్తి అయిందని, ఇక మిగిలిన మూడున్నరేళ్ళలో, అభివృద్ధి పనులను పూర్తి చేయడంలో ఎట్టిపరిస్థితుల్లోనూ కాలయాపన చేయొద్దని స్పష్టం చేశారు. పనులకు భూమిపూజ చేసిన తర్వాత నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అనంతరం గత సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాల పురోగతిపై మంత్రి ఆరా తీశారు.అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాల్సిందేనని, పనులు పటిష్టంగా ఉండేందుకు ఇంకా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పనులను చేపట్టకుండా జాప్యం చేస్తున్న గుత్తేదారులపై చర్యలు తీసుకోవాలని సూచించారు. రాజ్ విహార్ సమీపంలోని ఎల్లమ్మ గుడి నుండి జమ్మి చెట్టు వరకు హంద్రీ నది ఒడ్డున నిర్మిస్తున్న రహదారి పనులను వేగవంతం చేయాలని, బండ్ మరింత పటిష్టంగా ఉండేందుకు జలవనరుల శాఖ అధికారుల సలహాలు తీసుకోవాలని సూచించారు. ఆస్తి పన్ను, ట్రేడ్ లైసెన్స్ రుసుముల మొండి బకాయిల వసూళ్లకు ప్రత్యేక యాక్షన్ ప్లాన్ అమలు చేయాలని పేర్కొన్నారు. శిథిలావస్థకు చేరిన నీటి ట్యాంకుల నాణ్యత సామర్థ్యాన్ని పరిశీలించాలని సూచించారు. పార్కుల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించాలని, ఆగస్టు ఆఖరు నాటికి పార్కుల్లో మరమ్మత్తులు పూర్తి చేయాలని ఆదేశించారు. రహదారులపై ఎక్కడా గుంతలు కనబడకుండా ఎప్పటికప్పుడు పూడ్చడానికి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. డిసెంబర్ నాటికి 30 వేల మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణకు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కమ్యూనిటీ హాల్స్‌లలో ఉన్న సచివాలయాను ఖాళీ చేసి, వాటి పైకి తరలించడం లేదా మరోచోటికి మార్చే ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. రహదారుల విస్తరణ పనులు జాప్యం చేయొద్దని, స్థలం కోల్పోయే బాధితులతో త్వరితగతిన మాట్లాడి నష్టపరిహారం అందించాలని, త్వరగా విస్తరణ పనులను చేపట్టాలని ఆదేశించారు. వెండర్ జోన్లను సైతం ఆలస్యం చేయకుండా త్వరగా ఏర్పాటు చేయాలన్నారు. మరుగుదొడ్ల నిర్వహణ మెరుగుపరిచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.డిప్యూటీ కమిషనర్ సతీష్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, ఆర్ఓ జునైద్, ఇంచార్జ్ ఎస్ఈ శేషసాయి, ఎంఈ లీల ప్రసాద్, టిపిఆర్ఓ వెంకటలక్ష్మి, పారిశుద్ధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు, టిడ్కో అధికారి పెంచలయ్య, సూపరింటెండెంట్లు సుబ్బన్న, స్వర్ణలత, మంజూర్ బాష, కార్పొరేటర్ పరమేష్, తదితరులు పాల్గొన్నారు.

# జూలై 31 వ తేది లోపు బంగారు కుటుంబాల దత్తత పూర్తి కావాలి :జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా



కర్నూలు, జూలై 16 జూలై 31 వ తేది లోపు బంగారు కుటుంబాల దత్తత పూర్తి కావాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో నియోజకవర్గ స్పెషల్ అధికారులు, ఎంపిడిఓలు, డిస్ట్రిక్ట్ విజన్ ప్లాన్ యూనిట్, నియోజకవర్గ విజన్ ప్లాన్ యూనిట్ సభ్యులతో జీరో పావర్టీ పి4 పాలసీ అమలుపై జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జీరోపావర్టీ పి4 పాలసీ అమలు లో భాగంగా జిల్లాలో 64128బంగారు కుటుంబాలను గుర్తించడం జరిగిందన్నారు. గ్రామాలు, వార్డుల్లో ఈ నెల 15నుండి 25 వ తేదీ వరకు గ్రామసభలను నిర్వహించడం జరుగుతోందని, గ్రామ సభల్లో ఈబంగారు కుటుంబాల జాబితాను మరోసారి పరిశీలన చేసి, అర్హులైన వారితో తుది జాబితాను తయారు చేయాలన్నారు. ఈ నెల 31వ తేదీ నాటికి తుది జాబితాలో ఉన్న బంగారు కుటుంబాలను మార్గదర్శులు దత్తత తీసుకునేలాచర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవడం అంటే ఆర్థికంగా సాయం చేయడం అని అనుకోకూడదని, చదువు, ఉద్యోగం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను వినియోగించుకునేలాసరైన విధంగా మార్గదర్శనం చేసి ఆ కుటుంబాన్ని అభివృద్ధి చేయడం కూడా ఇందులో భాగం అని కలెక్టర్ తెలిపారు. మార్గదర్శులను గుర్తించేందుకు గ్రామ కమిటీలు వేయాలని కలెక్టర్ సూచించారు.గ్రామానికిఒకఅధికారిని ఇంచార్జి గా నియమించాలన్నారు..కుటుంబ అవసరాలు, వ్యక్తిగత అవసరాలు, గ్రామ అవసరాలు ఏవైనా తోడ్పాటు అందించవచ్చని, అవసరాలను గుర్తించేందుకు నిర్వహించే సర్వేను జాగ్రత్తగా చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.. గ్రామాల్లో స్థితిమంతులు గా ఉన్నవారు, బాగా చదువుకున్న వారు, ఉద్యోగులు, వైద్యులు, గ్రామ పెద్దలు తదితరులను మార్గదర్శకులుగా గుర్తించాలన్నారు.. ఇందుకోసం గ్రామానికి ఒక సచివాలయ సిబ్బందినీ ఇంచార్జి గా పెట్టాలని కలెక్టర్ ఎంపిడిఓ లను ఆదేశించారు. ఈ అంశం పై ప్రతి రోజు సమీక్షలు నిర్వహించుకోవాలని, సచివాలయ సిబ్బంది తో సమావేశం నిర్వహించుకుని, ఈ కార్యక్రమాన్ని సక్రమంగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎంపిడిఓ లను ఆదేశించారు.. అలాగే ఆర్డీఓ లు, తహసిల్దార్ లు కూడా ఈ కార్యక్రమం అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు..ప్రైవేట్ స్కూల్ మేనేజ్మెంట్స్, ఇండస్ట్రీస్, డాక్టర్స్ తదితరులను భాగస్వాములను చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు..పేదలకు ఆదుకునే అవకాశం ఉన్న మంచి కార్యక్రమం అని, మానవతా కోణంలో ఆలోచించి అందరూ ఈ కార్యక్రమం లో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తిచేశారు. సమావేశంలో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, పి 4 పాలసీ స్టేట్ కన్సల్టెంట్ స్పర్శ్, సిపిఓ హిమ ప్రభాకర్ రాజు, జిల్లా పరిషత్ సీఈఓ నాసర రెడ్డి, హౌసింగ్ పిడి చిరంజీవి, జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్, ఇండస్ట్రీస్ జిఎం జవహర్ బాబు, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, పత్తికొండ ఆర్డీఓ భరత్ నాయక్ , డిపిఓ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు..

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190